

నెలాఖరు. అందులోనూ ఆదివారం. జేబులో వున్నది వందరూపాయలు. అవసరం వెయ్యిరూపాయలు.

ఏం చెయ్యాలో తోచలేదు. ఎవర్నడిగినా ఈ నెలాఖరు రోజుల్లో మొండి చెయ్యే ఎదురు. మతిపోయి అబిడ్ రోడ్డులో పడ్డాను.

సారధి కన్పించాడు - దేవుడిలా! వాడు నా బాల్య మిత్రుడు. బంగారు పిచ్చిక. డబ్బులో పుట్టాడు. డబ్బులో పెరిగాడు. డబ్బులో జీవిస్తున్నాడు. కానీ వట్టి పిసినారి. తాగినప్పుడు మాత్రం దానకర్ణుడు.

వాణ్ణి చూడగానే ఓ ఆలోచన



వచ్చింది - ఎరను వేసి చేపను పట్టాలని! సారధిని "వెట్ పార్టీ"కి వప్పించే సరికి నా తలప్రాణం తోకకు వచ్చింది

అది నా బర్త్‌డే పార్టీ అనీ, బిల్లు నేనే చెల్లిస్తానని చెప్తేగాని వాడు దారికి రాలేదు. యిద్దరం బార్‌లో పడ్డాం.

నా జేబులోని ఎనభయ్యారు రూపాయల 'చిలుం' వదలడంతో పార్టీ పూర్తయింది. ఇంకా నా జేబులో పధ్నాలుగు రూపాయ లున్నాయి. రాబోయే డబ్బు గురించి ఆలోచిస్తుంటే అంత ఖర్చయినా నాకేమీ బాధ అన్పించలేదు. బార్‌లో నుండి బయటపడ్డాం.

మాంచి స్వింగ్‌లో వున్నాడు సారధి. యిక అప్పు సంగతి అడగొచ్చు అనుకొంటున్నా.

యింతలో ఎక్కణ్ణించో వూరోళ్ళ కారేసుకొని వూడిపడ్డాడు, రామారావ్! వస్తూనే "రారా సారధీ! నిన్నింటి దగ్గర డ్రాప్ చేస్తాను." అంటూ నా బంగారు పిచ్చుకని గద్దలా తన్నుకుపోయాడు.

మతిపోయినట్లుగా నేనలాగే నిలబడి పోయాను. తర్వాత తెలిసింది - రామారావు ఆ రెండువేలు సారధి దగ్గర ఆ 'స్వింగ్'లోనే అప్పుపట్టేశాడని.